క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



కాటారం: మండల కేంద్రానికి చెందిన పక్కల రాజబాబు ద్విచక్ర వాహనంపై మహాముత్తారం వెళ్తూ సెల్‌ఫోన్ పాగొట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి రాజుకు ఎస్సై పవన్‌కుమార్ ఆదివారం అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం



కాటారం: మండల కేంద్రంలోని శ్రీఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలాధారణ భక్తులకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. ఆదివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. అంతకముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాలాధారణ స్వాములతో కలిసి నైవేద్యం సమర్పించారు. అన్నదాత దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు అశోక్‌గుప్త, కమిటీ చైర్మన్ బచ్చు ప్రకాశ్, గురుస్వాములు జక్కు మొగిలి, అయిత వెంకన్న, రామకృష్ణరావు, ముస్కమల్ల సత్యం, పెండ్యాల రంజిత్, చీమల రాజు, అయ్యప్ప మాలాధారణ స్వాములు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

● ఎస్సై గోగికారి ప్రసాద్

టేకుమట్ల: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని అంతడుపుల గ్రామానికి చెందిన పెనుకుల కుమారస్వామిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు కాగా కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ అతడికి జైలు శిక్షతో పాటు, జరిమానా విధించినట్లు ఆదివారం తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ తుల రమేశ్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



ములుగు: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లాకేంద్రంలో బండారుపల్లి రోడ్డులో గల వెంచర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన కొంత మంది మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. పక్కనే పడి ఉన్న రాయిపై రక్తం మరకలు ఉండడం మద్యం తాగినట్లు ఖాళీ మద్యం సీసా, కల్లు బాటిల్ కనిపించడంతో పస్రా సీఐ రవీందర్ ఆధ్వర్యంలో క్లూస్ టీం ద్వారా వివరాలను సేకరించారు. మృతుడి జేబులో దొరికిన డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన ఒర్సు శ్రీను(38)గా ప్రాథమికంగా గుర్తించారు. దొరికిన సమాచారంతో ఆరా తీయగా మృతుడు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాత్రి 07 గంటల వరకు కుటుంబ సభ్యులు ఎవరు రాకపోవడంతో మృతదేహం సంఘటన స్థలంలోనే ఉంది. ఇదిలా ఉండగా శ్రీనివాస్‌ను తనతో వచ్చిన కొంత మంది మర్డర్ చేసి ఉంటారని అనుమానాలు రేకెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులు వచ్చి దరఖాస్తు ఇస్తే తప్పా కేసు ముందుకు సాగేలా లేదు.

రైతులకు అండగా ప్రభుత్వం

శాయంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపే రాష్ట్రవ్యాప్తంగా రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేపట్టిందని, రైతాంగానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం ఏఓ గంగజమున అధ్యక్షతన జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం)లో భాగంగా 20 మంది రైతులకు యాసంగి సీజన్‌లో 15 కిలోల వరి ధాన్యం విత్తనాల బస్తాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం రూపొందించిన ధరణి పోర్టల్‌తో రైతులకు పట్టా పాస్ పుస్తకాలు, రుణాలు రాక అవస్థలు పడ్డారని ఆరోపించారు.

అందని బ్యాంకు సేవలు!

● పంజాబ్ నేషనల్ బ్యాంకు గతంలో ఏటూరునాగారానికి తరలింపు
● ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు
● కన్నాయిగూడెం తరలించాలని డిమాండ్



ఏటూరునాగారంలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్

కన్నాయిగూడెం: మండల ప్రజలకు సరైన బ్యాంకు సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కన్నాయిగూడెంలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకును అప్పటి పరిస్థితిలో ఏటూరునాగారం తరలించారు. పక్క మండలంలో ఉండటంతో స్థానికులు నిత్యం బ్యాంకు పనులపై వందల రూపాయలు చార్జీలు పెట్టి వెళ్లాల్సిన పరిస్థితి. వెళ్లిన సమయంలో పని కాకపోతే మళ్లీ వెళ్లడం జరుగుతుందని దీంతో ఇబ్బందులు పడుతున్నామని మండల వాసులు వాపోతున్నారు. ఏటూరునాగారంలో ఉన్న చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు ఖాతాలు తీసి తమ మండలం కంటే వారికే లోన్లు ఎక్కువ ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇక్కడి ప్రజలు పోతే లేనిపోని కారణాలు చెప్పి కొర్రీలు పెడుతున్నారని, నెలల తరబడి తిప్పుతున్నారని వాపోతున్నారు. వ్యక్తిగత లోన్లు తమ మండల ప్రజలకు 10 శాతం కూడా ఇవ్వటం లేదంటున్నారు. అన్ని ఏటూరునాగారం ప్రజలకే ఇచ్చి బ్యాంకు అధికారులు చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడి ప్రజలు అడిగితే అంతదూరం ఇవ్వడం లేదు, మీరు రికవరి కట్టరు అని సమాదానం ఇస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. దీనితో మండల ప్రజలకు అందాల్సిన సేవలు పూర్తిగా పక్క మండల ప్రజలకు చేరువ అవుతున్నాయి.

కన్నాయిగూడెం తరలించాలి..

మండల పరిధిలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను ఉన్నతాధికారులు చొరవ తీసుకోని వెంటనే ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడేనికి తరలించి మండల ప్రజలకు బ్యాంకు సేవలు చేరువ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో బ్యాంకుకు కావల్సిన అన్ని అనువైన వసతులు ఉన్నాయి. ఇక్కడికి తరలిస్తే బ్యాంకు సేవలు మండల ప్రజలకు దగ్గరకావడంతో పాటు వారికి భారం కూడా తగ్గుతుంది.

ఇబ్బంది పెడుతున్నారు..



క్రాపులోన్ ఇవ్వాలని బ్యాంక్‌కు వెళ్తే ఎకరం పైభూమి ఉంటెనే ఇస్తామని ఇబ్బంది పెడుతున్నారు. మూడు రోజులు పోయిన ఇవ్వను అన్నారు. బయట వడ్డికి అప్పు తెచ్చి మిర్చి పెట్టుబడి పెట్టుకున్నా.

- మహేందర్, యువకుడు, బుట్టాయిగూడెం

ఏటూరునాగారం వాళ్లకే ఇస్తున్నారు..



వ్యక్తిగత వ్యాపారలోన్‌లు ఇక్కడి ప్రజలకు ఇవ్వడం లేదు. అడుగుతే ఇక్కడికి ఇవ్వం అంటున్నారు. ఏటూరునాగారం వాళ్లకే ఇస్తున్నారు. అధికారులు చొరవ తీసుకోని బ్యాంక్‌ను మా మండలానికి తరలించాలి.

- దుర్గం రాజ్‌కుమార్, యువకుడు

సమయం వృథా..



పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మండలానికి తరలించాలి. గతంలో బ్యాంక్ కన్నాయిగూడెంలో ఉండేది. ఏటూరునాగారంలో ఉండడంతో అక్కడికి వెళ్లాలంటే చార్జీలు, సమయం వృథా అవుతున్నాయి.

- దుర్గం రాజేశ్, చింతగూడెం

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని పటేల్ ఐకేర్ మంథని వ్యవస్థాపకుడు, ఆప్తాల్మిక్ వైద్యులు సతీష్ కుమార్, రంజిత్ పటేల్‌ల సహకారంతో శనివారం నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి మద్దులపల్లి, కుంట్లం, పలుగుల గ్రామాల ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిలో శుక్లాలు, తెరిజియం, కంటిలో రెటీనాతో బాధపడుతున్న వారిని ఉచితంగా ఆపరేషన్ చేయడానికి రెఫర్ చేశారు. బీపీ, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఆర్‌ఎంపీ రాజేందర్, అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ, పూతల శ్యామ్, మచ్చ రాజేశ్, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాకేశ్, గట్టయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే ఎస్టీ వర్గీకరణ సాధ్యం

● చందా లింగయ్య దొర



మాట్లాడుతున్న చందా లింగయ్య దొర

ఏటూరునాగారం: సుదీర్ఘ పోరాటాలతోనే ఎస్టీ వర్గీకరణ సాధ్యమవుతుందని జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ చందా లింగయ్య దొర అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ 9వ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలకు అటవీ హక్కు పత్రాలు, పది ఎకరాలు ఉన్న ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు అందించి రైతు భరోసా ఇవ్వాలని, ఐటీడీఏ పరిధిలో 29 శాఖలను బలోపేతం చేయాలని, పోడు భూములకు సర్వే చేపట్టి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ రమణల లక్ష్మయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వట్టం నారాయణ, గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ యాసం రాజు, కొమురం శేషయ్య, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, కన్నయ్య, శ్రీనివాస్, రాంమూర్తి, రాము, జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్ధన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గోవిందరావుపేట: మండల పరిదిలోని పస్రా గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 2006–07 సంవత్సరంలో పదోవ తరగతి చదువుకున్న విద్యార్థులు చల్వాయి లక్నవరం సరస్సు సమీపంలో 16 సంవత్సరాల తర్వాత తిరిగి కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వల్లాల మనోహర్, సత్యం, సుమన్, దామోదర్, సాంబయ్య, లావణ్యలను ఘనంగా సన్మానించారు.

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

● ప్రిన్సిపాల్ నాగలక్ష్మి

కాటారం: విద్యార్థులు గణితంపై భయం వీడి ఆసక్తి పెంచుకోవాలని ప్రిన్సిపాల్ నాగలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు గణితశాస్త్రంకు సంబంధించిన ప్రాజెక్టులు, నమూనాలు, ఆకృతులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు గణితశాస్త్రం అభివృద్ధి, మానవాళి పెరుగుదలతో గణితం ప్రాముఖ్యత, ఇతరాత్ర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈ దశ నుంచే విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స చేయిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని క్రోసూరుపల్లి శివారు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని నైన్‌పాకకు చెందిన శంకర్ స్కూటీపై చిట్యాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో భూపాలపల్లి మండలం గొర్లవీడుకు చెందిన ఆర్‌ఎంపీ మార్కండెయా మండలంలోని రాంచంద్రాపూర్ నుంచి చిట్యాలకు ద్విచక్రవాహనంపై వస్తూ స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో శంకర్‌కు స్వల్ప గాయాలు కాగా, మార్కెండయాకు తలకు తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్, కానిస్టేబుల్ లాల్‌సింగ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మార్కండెయాను చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్లి గాయపడిన వారికి ఆస్పత్రికి తరలించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం అందించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి అయిలయ్య తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కె.నర్సయ్యకు రూ.49 వేలు, గుర్రాల కవితకు రూ.21.500లు, కొండం శ్రీకాంత్‌కు రూ.19 వేల చెక్కులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడిశెట్టి కోటి, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, జాకీర్, ఎల్లయ్య, సదానందం, మొగిలి, సారంగం, రమేష్, వెంకన్న, రాజు, రాజేష్, శ్రీధర్, భిక్షపతి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేకనే ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పలిమెల: అభివృద్ధిని ఓర్వలేకనే బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కొద్ది రోజులుగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కోయల్‌కార్ సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి భూములును కట్టబెట్టాలని మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీను బాబు చూస్తున్నారని వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మండల ప్రజలకు ఎవరు ఎలాంటి నాయకులో, దోచుకొని దాచుకునే వారో స్పష్టంగా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఎస్‌కే హోలీ హైదర్, నాయకులు కమ్మల శ్రీనివాస్, నానువాల తిరుపతి, లక్ష్మణ్, చంద్రకళ, రమ, జయ, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి



భూపాలపల్లి రూరల్: నిరసన తెలుపుతున్న నాయకులు



ఎస్ఎస్ తాడ్వాయి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి దుగ్గి చిరంజీవి అన్నారు. సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కాటాపూర్‌లో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దుగ్గి చిరంజీవి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తుందన్నారు. అంబేడ్కర్ ఒకరినే కాదని దేశంలోని గిరిజన, దళిత బలహీన వర్గాల ప్రజలందరినీ అమిత్ షా కించపరిచినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అమిత్ షా వ్యాఖ్యలను సమర్థిస్తున్నారన్నారు. సీఐటీయూ మండల చిట్టినేని శ్రీను, నాయకులు సత్యనారాయణ,నర్సింగారావు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బందెల విజయ్‌కుమార్, మల్లయ్య, సంజీవ, మల్లికార్జున్, బాబురావు, వైనాలా పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా అవమానించేలా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ.. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్ల ప్రేమ్‌కుమార్, ఎమ్మార్పీఎస్(టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య మాదిగ, జిల్లా ఇన్‌చార్జ్ రేగుంట నర్సయ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అమిత్‌షా వెంటనే పదవికి రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు సతీష్, బచ్చల చిరంజీవి, శీలపాక హరీశ్, రాజబాబు, శ్యామ్, డేవిడ్, సాల్మాన్ రాజ్, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె గాయకుడికి ఆదరణ కరువు

● 100కు పైగా పాటలు రాసిన నరేశ్
● తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర
● జాతీయ అవార్డు పొందినా ఆదరణ అంతంతే..



అంబేడ్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డును అందుకుంటున్న నరేశ్ (ఫైల్)

చిట్యాల: పాఠశాల స్థాయి నుంచే పాటలు పాడుతూ జానపదంపై మక్కువ పెంచుకుని సమాజంలో మార్పు కోసం చైతన్య గీతాల రచనలు చేసి పలువురి చేత ప్రశంసలు పొందాడు యువ రచయిత, గాయకుడు దాసారపు నరేష్. మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి, పాఠశాల స్థాయి నుంచే గాయకుడిగా ఎన్నో బహుమానాలు, సత్కారాలు అందుకున్నాడు. 2018 సంవత్సరంలో అత్యుత్తమ పురస్కారమైన అంబేడ్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డును ఢిల్లీలో భారత జాతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు సుమనాక్షర్ చేతుల మీదుగా అందుకున్నారు.

పాటలపై మక్కువతో..

బాల్యం నుంచే పాటలపై మక్కువతో పాటే ప్రాణంగా పలు పాటలు రాసి పాడేవారు. 2010లో 'నా తొలిపాట' అనే ఆల్బమ్‌ను రూపొందించి తన పాటలను సమాజానికి పరిచయం చేశారు. అనంతరం పలు సామాజిక గీతాలతో కూడిన 'మా ప్రయత్నం' ఆడియో, తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన అమరవీరుల జ్ఞాపకార్థం 2015లో 'నింగిలో తారవై', 'అమరులకు జోహార్లు' వంటి ఆల్బమ్‌లు రచించాడు. కన్నతల్లి మనసును, గొప్పదనాన్ని ప్రతిబింబించేలా రూపొందించి విడుదల చేసిన 'అమ్మరుణం' అనే ఆల్బమ్‌తో పాటు 'ఉగ్రనరసింహుడు' వంటి భక్తిగీతాలను సైతం రచనలు చేసి ప్రజల మన్ననలు పొందాడు. ఇప్పటి వరకు సుమారు 100కు పైగా పాటలను రాసి పాడారు. అలాగే ఇటీవల రాసిన మరికొన్ని పాటలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

ఉద్యమ సమయంలో తనదైన పాత్ర..

కాలుకి గజ్జకట్టి, డప్పుదరువులతో తెలంగాణ ప్రాంత ప్రజల దీనగాధలను తన తూటాలాంటి పాటలతో ప్రజలను చైతన్యపరిచి తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్రతో కీలకంగా వ్యవహరించారు. అలుపెరుగని దీక్షతో తెలంగాణ ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగసిన కెరటంగా తన ఆట, పాటలతో అనేక దూంధాం కార్యక్రమాల్లో ప్రజలను చైతన్య పరిచారు.

పొందిన అవార్డులు

● 2014లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మండల ఉత్తమ సాహితీ వెత్తగా అవార్డును మండల అధికారుల చేతుల మీదుగా తీసుకున్నారు.
● 2015లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉత్తమ గాయకుడిగా ఉమ్మడి జిల్లాల ఫొటోగ్రఫీ అధ్యక్షులు రెడిన్ లింగమూర్తి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.
● 2017లో రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా జిల్లా ఉత్తమ సాహితీ వెత్తగా అప్పటి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, కలెక్టర్ ఆకునూరి మురళి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ప్రోత్సాహం అందించాలి



రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కళాకారులను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించాలి. నాలాంటి పేద కళాకారులకు ఉద్యోగం ఇవ్వాలి. ఎన్నో పాటలు రాసి ప్రజలను చైతన్యవంతులుగా తీర్చి దిద్దడంలో పాత్ర పోషిస్తున్నా. చల్లగరిగ గ్రామానికి చెందిన సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్, టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన సినీ, జానపద గేయ రచయిత మిట్టపెల్లి సురేందర్‌లు నాకు ఆదర్శం. వారి స్ఫూర్తితోనే పాటలపై మక్కువ పెంచుకుని రాస్తున్నా.

- దాసారపు నరేశ్

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎఫ్ నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లాలో అద్దె భవనాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతూ.. ఆదివారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్‌లో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్)జిల్లా ఇన్‌చార్జ్ అంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. హాస్టళ్లలో ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి మహేష్, జాదవ్ దీపక్, విష్ణు, రాజకుమార్, బీసీ, ఎస్సీ ,ఎస్టీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



వాజేడు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మండలంలో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీఓ ఆదివారం పరిశీలించారు. పొరపాట్లు లేకుండా సర్వే చేపట్టాలన్నారు.